క్లుప్తంగా

సహజవనరుల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కోనరావుపేట: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పొలాస) విద్యార్థినులు, జిల్లా ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం మామిడిపల్లిలో రైతులతో కలిసి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక మూల్యాంకన తులణంలో భాగంగా వివిధ అంశాలపై చిత్రపటాలు వేసి వాటి ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు, కళాశాల విద్యార్థులు సోనిక, సాయి సౌమ్య, సాత్విక, రేష్మా, శ్వేత పాల్గొన్నారు.

కేసీఆర్ దంపతుల పేరిట పూజలు



పోచమ్మ ఆలయానికి ఫ్రిజ్ అందిస్తున్న టీజీఏ ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దంపతుల పెళ్లిరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక పాతపోచమ్మ ఆలయంలో కల్వకుంట్ల శోభ–చంద్రశేఖర్‌రావు పేరుతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించిన రిఫ్రిజిరేటర్‌ను ఆలయానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్, ఆలయ అధ్యక్షుడు సిరిగిరి మురళి, ధర్మకర్త కూర శ్రీధర్, శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఉప్పుల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్‌లో..



భట్టిని కలిసిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: టీపీసీసీ శాసనసభ నాయకుడు మల్లు భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ కార్యక్రమానికి సిరిసిల్ల నాయకులు తరలివెళ్లారు. పాదయాత్ర ఆదివారం హుజురాబాద్ నియోజకవర్గంలో జరుగడంతో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నేతలు టీపీసీసీ ఫ్లోర్‌లీడర్‌ను కలిశారు.

మొగులు దిగులు

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తూకం వేయని వైనం
- కోతకొచ్చిన వరి
- 50 శాతం పూర్తయిన కోతలు
- కల్లాల్లో పోసిన ధాన్యం
- వర్షాలతో దిగులు చెందుతున్న రైతులు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం

ఇల్లంతకుంట: రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డచందంగా మారుతోంది. వర్షాకాలం సీజన్‌లో వరిపైర్లకు దోమపోటు, మొగిపురుగు సోకడంతో ఎకరాకు 30 క్వింటాళ్లు రావాల్సిన ధాన్యం దిగుబడి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకే వచ్చింది. కనీసం యాసంగి సీజన్‌లోనైనా పంట దిగుబడి బాగా వస్తుందని ఆశపడ్డ రైతుల ఆశలన్నీ అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. నెల రోజుల క్రితం వడగళ్ల వాన కారణంగా వరి పైర్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఇప్పుడు వరి కోతకు వచ్చిన సమయంలో వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట ఎక్కడ మట్టిపాలవుతోందోనని, వేలాది రూపాయల పెట్టుబడి పెడితే మట్టిపాలవుతుందని రైతులు హైరానా పడుతున్నారు. ఇల్లంతకుంట మండల వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే మండలంలో 50 శాతం వరకు వరి కోతలు పూర్తి కావస్తున్నాయి. మరో నెల రోజుల పాటు వరుణుడు కరుణిస్తే వరి కోతలతో పాటు, ధాన్యం తూకం కూడా పూర్తవుతుందని రైతులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం మాత్రమే

ఇల్లంతకుంట, గాలిపల్లి సహకార సంఘాల ఆధ్వర్యంలో సుమారు 25 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల నుంచి ఊరూరా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారే తప్ప ఎక్కడ కూడా తూకం వేసిన దాఖలాలు కనిపించడం లేదు. రైస్ మిల్లుల అలాట్‌మెంట్ రాకపోవడం, ధాన్యంలో తేమ ఎక్కువ ఉండటం కారణంగా ఇంకా తూకం ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో పాటు తూకాలు వేగవంతంగా అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వరుణుడు కరుణించాలి

మండలంలో అనంతగిరి, మధ్యమానేరు రిజర్వాయర్లు ఉండటంతో పాటు, అనంతారం ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉండటంతో ఈ యాసంగి సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణమవుతుందేమోనని రైతులు హైరానా పడుతున్నారు. వరుణుడు కరుణిస్తే పంట చేతికొస్తుందని రైతులంటున్నారు.

తూకం వేయండి



మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల ప్రతినిధులు ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారే తప్ప ఇంకా రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ చేయలేదు. దీంతో తూకాలు ప్రారంభించడం లేదు. కొనుగోళ్లకు సరిపడా గోనె సంచులు తెప్పించి మే నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తిచేయాలి. వర్షాల కారణంగా రైతులు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారు.

– పసుల వెంకటి, పెద్దలింగాపూర్

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మా పొత్తూరు గ్రామంతో పాటు చాలా గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడమే కాకుండా ధాన్యాన్ని త్వరగా తూకం వేస్తే రైతులకు మేలు జరుగుతుంది. లారీలు, గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుని వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయాలి.

– గుంటి మహేశ్, పొత్తూరు

తేమ శాతం వస్తే కొనుగోళ్లు



మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. కాబట్టి ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ధాన్యం తేమ శాతం రాగానే తూకాలు ప్రారంభిస్తాం. గోనె సంచులు అన్ని కేంద్రాలకు సరఫరా చేయడం జరుగుతుంది.

– రవీందర్, సీఈవో, పీఏసీఎస్

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతులు ఉన్నందున నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు వెంకంపేట, పాత బస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, అనీఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికాన గర్, కోర్టు ఏరియా, శాంతినగర్, అంబేద్కర్ నగర్, విద్యానగర్, భవానీ రుషినగర్, రెడ్డివాడ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించి పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇట్టి ధర్నాకు హమాలీ కార్మికులందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎలిగేటి రాజశేఖర్, హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు రాములు, దేవదాస్, సురేశ్ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో ఆదివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో బొడ్డు నితీశ్ , ఆసాని సాయికుమార్ అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు. వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన భక్తులు కారులో తిరుగుప్రయాణమయ్యారు. తంగళ్లపల్లి శివారులో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నితిన్, సాయి తీవ్రంగా గాయపడ్డారు. ఫొటోగ్రాఫర్‌లుగా పనిచేస్తున్న వీరిరువురు ప్రోగ్రామ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మామిడి రాములు, రమేశ్ బైక్‌పై సిరిసిల్ల వెళ్తుండగా.. ఎదురుగా మరో వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న రాములు, రమేశ్, స్థానికుడు జంగ రాములు గాయపడ్డారు. ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కల్లాల్లో ధాన్యం



వేములవాడరూరల్: కష్టపడి పండించిన పంటను కూడా అన్నదాత విక్రయించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాడు. ఇప్పుడిప్పుడే కోతలు మొదలై ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్న రైతన్నలకు అకాల వర్షం అతలాకుతలం చేస్తోంది. ఈదురుగాలులు రావడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతన్నలు ఇబ్బంది పడుతున్నారు. వేములవాడ మండలంతో పాటు పలు గ్రామాల్లో రైతులు పంటను కల్లాల వద్ద ఆరబెట్టుకుని ఎప్పటికప్పుడు తేమ శాతం తగ్గించుకునేందుకు పొద్దస్తమానం కుటుంబసభ్యులు కల్లాల వద్దనే ఉంటున్నారు. ధాన్యం తేమ శాతం తగ్గగానే అకాల వర్షాలతో మళ్లీ ధాన్యం తడిసిపోతోంది.

పరిహారం చెల్లించాలి

వీర్నపల్లి: అకాల వర్షానికి వరి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా దిశ కమిటీ సభ్యులు బట్టు పీర్య డిమాండ్ చేశారు. బాబాయ్ చెర్వు తండా గ్రామంలో వర్షానికి నష్టపోయిన వరి చేలను ఆదివారం పరిశీలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నాన్చివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ మండల నూతన అధ్యక్షుడిగా జక్కుల మహేందర్, ఉపాధ్యక్షులుగా రాందాస్, నారాపురం నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా శంకర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోనరావుపేట: శనివారం కురిసిన వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు అన్నారు. మండలంలోని బావుసాయిపేట, గోవిందరావుపేట, కనగర్తి, వట్టిమల్ల గ్రామాల్లో ఎక్కువగా నష్టం జరిగిందన్నారు. మండల తహసీల్దార్, వ్యవసాయాధికారులు జరిగిన పంట నష్టాలను పరిశీలించి అధికారులకు నివేదిక పంపాలన్నారు. వారి వెంట నాయకులు బీజేపీ, బీజేవైఎం, కిసాన్ మోర్చా నాయకులు మిర్యాల పురుషోత్తంరావు, జవ్వాజి తిరుపతి, గొట్టె రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న పంటలను పార్టీ వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్ట పోయిన పంటలను వ్యవసాయాధికారులతో సర్వేలు చేయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడె సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షులు పోంచెట్టి రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డుపై మురుగు

సిరిసిల్లటౌన్: బల్దియా నిర్లక్ష్యం మూలంగా జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్ కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన మురుగు సమస్యతో ప్రజలు అనునిత్యం అల్లాడుతున్నారు. పాతబస్టాండ్ నుంచి సంజీవయ్యనగర్‌కు అడుగేసే ప్రధాన రహదారి ఇలా మురుగునీటితో మునిగింది. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా స్పందించి కాలనీవాసులను మురుగు కూపం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

మీరు ప్రశ్నించాల్సిన అధికారి: సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్
ఫోన్ నంబరు: 98499 08822

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. మండలంలోని పొత్తూరు, కందికట్కూర్, కిష్టారావుపల్లి, వల్లంపట్ల, ఓబులాపూర్, వెల్జిపూర్, రహీంఖాన్‌పేట, అనంతగిరి, సిరికొండ, దాచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ గొడుగు తిరుపతి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: మున్సిపల్‌9వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ఏపీఎం మల్లేశం, సీసీలు మంగ్యా నాయక్, సుదర్శన్, వీవోఏ స్వప్న, వీవో అధ్యక్షురాలు రేణుక, రైతులు పాల్గొన్నారు.

అందని ఉపాధి వేతనాలు

- నెలల తరబడి ఎదురుచూపు
- కూలీల ఇబ్బందులు

కోనరావుపేట: ఎండనకా, వాననకా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. దీంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

11,292 జాబ్‌కార్డులు

మండలంలోని 28 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. రోడ్లకిరువైపులా మొక్కలు నాటడం, వాటి పాదు ఏర్పాటు చేయడం, నీళ్లు పట్టడం, కాలువ పనులు తదితర పనులు జరుగుతున్నాయి. మండలంలో మొత్తం 11,292 ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉండగా ప్రతిరోజూ సుమారు 1,500 మంది పనిచేస్తున్నారు. వీరందరికీ కలిపి నెలకు సుమారు రూ.70 లక్షలు వేతనాల రూపంలో కూలీలకు చెల్లిస్తున్నారు.


రెండు నెలలుగా అందని వేతనాలు

మండలంలో వివిధ రకాల ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. పనిచేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని నిబంధన ఉన్నా, నెలలు గడుస్తున్నా వేతనాలు మంజూరు కావడం లేదు. మరికొందరికీ ఏడాది నుంచి వేతనాలు రావడంలేదు. ఇదిలా ఉండగా ఉపాధి పనులపై నిర్లక్ష్యం కూడా ఎక్కువ అవుతోంది. ప్రతి వేసవిలో పనులను చేసిన కూలీలకు అదనంగా 10 నుంచి 30 శాతం వరకు అదనంగా వేతనాన్ని అందించేవారు. ఈ సంవత్సరం నుంచి అది కూడా తొలగించారని కూలీలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేసేందుకు కూలీలు ఉత్సాహం చూపడంలేదు.



ఉపాధి హామీ పనుల్లో కూలీలు

వేతనాలు రావడంలేదు



కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. దీంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. నాకు ఆరు నెలల క్రితం పనిచేసిన పనుల వేతనాలు అందలేదు. అధికారులు స్పందించాలి.

– కల్లూరి లింగవ్వ, కూలీ, కొలనూర్


రెండున్నర నెలలుగా ఇదే తీరు



ఆరు నెలల క్రితం రెండున్నర నెలలు పని చేశా. ఇప్పటి వరకు వేతనాలు రాలేదు. చేసిన పనికి వేతనం ఇవ్వకుంటే ఎలా? కూలీలకు వేతనాలు సకాలంలో అందించాలి.

– లంబ భాగ్య, నిజామాబాద్

వేతనాలు చెల్లిస్తున్నాం



ఉపాధిహామీలో పని చేసిన వారి ఖాతాల వివరాలు సక్రమంగా లేక కొంతమంది కూలీల వేతనాలు చెల్లించడంలో ఆలస్యమవుతోంది. తమ దృష్టికి వచ్చిన వారి వివరాలు, ఖాతా నెంబర్లు సరిచేసి వేతనాలు క్లియర్ చేస్తున్నాం. 45 రోజుల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది క్రితం పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లిస్తున్నాం. కొంతమందికి చెల్లించాం. ఎవరికైనా వేతనాలు రాకుంటే తమను సంప్రదిస్తే పరిష్కరిస్తాం.

– మందికట్ల శ్రీనివాస్, ఏపీవో

'బలగం' సినిమా ప్రదర్శన



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఆదివారం బలగం సినిమాను ప్రదర్శించారు. సినిమాను ప్రదర్శిస్తున్నట్లు గ్రామంలో ప్రచారం చేయడంతో పెద్దఎత్తున జనం తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాణి, అనసూయ, వార్డు సభ్యులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పోయిన ఫోన్ అప్పగింత



తంగళ్లపల్లి: మొబైల్ ఫోన్ రక్షణకు సీఈఐఆర్ అప్లికేషన్ ఎంతగానో దోహదపడుతుందని ఎస్ఐ లక్ష్మారెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలం..పోత్గల్‌కు చెందిన మామిండ్ల రాజు జనవరిలో గండిలచ్చపేట రహదారి మధ్యలో తన ఫోన్‌ను పోయింది. దీనిపై ఠాణాలో ఫిర్యాదు చేయగా, నూతన టెక్నాలజీ సీఈఐఆర్ ఉపయోగించి పోయిన ఫోన్‌ను గుర్తించిన పోలీసులు బాధితుడికి అందజేశారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 1446 మంది హాజరు

సిరిసిల్ల అర్బన్ : తెలంగాణ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. సిరిసిల మున్సిపల్ పరిధి చిన్నబోనాల, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, గంభీరావుపేట మండలం నర్మాల, బోయిన్‌పల్లి మండలాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 1512 మంది విద్యార్థులకు గాను 1446 మంది హాజరైనట్లు గురుకులాల సమన్వయ అధికారి జాక్వలిన్ తెలిపారు.

పోతుగల్‌లో బీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేత



జెండా గద్దె వద్ద బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో బీఆర్ఎస్ జెండాను బీజేపీ నాయకులు కూల్చివేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పోతుగల్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ జెండా గద్దెను నిర్మించామని సర్పంచ్ తన్నీరు గౌతంరావు తెలిపారు. శనివారం రాత్రి బీజేపీ నాయకులు కావాలనే జెండా గద్దెను కూల్చివేశారన్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం గద్దెను ధ్వంసం చేశారన్నారు. ప్రజలలో బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి దుశ్చర్యలకు బీజేపీ నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా బీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేసిన ఘటనలో బీజేపీ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మారెడ్డి పోలీస్ బలగాలను మోహరించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, బాలనర్సయ్య, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.